


PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

| బుధవారం 12 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :71 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి రష్యా వ్యోమగాముల శుభాకాంక్షలు

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 12: భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతున్న వేళ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న రష్యా వ్యోమగాములు భారత ప్రజలకు హృదయపూర్వక సందేశాన్ని అందించారు. భూమి నుంచి అంతరిక్షం వరకు భారత త్రివర్ణ పతాకం స్ఫూర్తిని, ఐక్యతను చాటుతూ సరిహద్దులను అధిగమించి ప్రపంచాన్ని ఏకం చేస్తోందని వారు పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా త్రివర్ణ పతాకంతో తమ గర్వకారణమైన క్షణాలను పంచుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంతరిక్షం నుంచి వచ్చిన ఈ ప్రత్యేక సందేశం భారతీయుల్లో దేశభక్తి భావాన్ని మరింత పెంచుతోంది.

## 22ఎ/నిషేధిత భూములపై అర్హులకు న్యాయం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 12: నిషేధిత ఆస్తుల పీఓబీ/22ఎ జాబితాలో ఉన్న భూముల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన, సాంకేతిక సమస్యలను పరిష్కరించి బాధితులకు ఊరట కల్పిస్తామని స్పష్టం చేశారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రక్రియ పత్రాలు, లే-అవుట్ అనుమతులు తదితర అన్ని డాక్యుమెంట్లను ఆగస్టు 14లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకోవాలని, నకిలీ పత్రాలకు అడ్డుకట్ట వేసేలా రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్లకు స్పష్టత ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వచ్చిన దరఖాస్తుల్లో అర్హమైన వాటిని గుర్తించి యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. 22ఎ పేరుతో పేదలు, అర్హులకు అన్యాయం జరిగితే సహించబోమని, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో మాత్రం ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలను పరిమితం చేసి ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారం మేరకే నిర్ణయాలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పీఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను వెంటనే తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకుని తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. పీఓబీకి సంబంధించిన దరఖాస్తులను నేరుగా కలెక్టర్లకు పంపించాలని, కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ స్థాయిలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహించాలని ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జిల్లా సబ్ రిజిస్ట్రార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి దరఖాస్తును కేసు వారీగా ప్రతిరోజూ సమీక్షించాలని, సమస్యలు ఏర్పడిన తర్వాత పరిష్కరించడం కంటే సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం కలెక్టర్ల బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

## జార్ఖండ్‌లో విద్యార్థులపై లాఠీచార్జ్.. రాహుల్ గాంధీ స్పందనపై రాజకీయ దుమారం



రాంచీ, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 12: జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా, తమ హక్కుల కోసం ఆందోళన చేస్తున్న జేపీఎస్సీ, జేఎస్ఎస్‌సీ అభ్యర్థులు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకునే క్రమంలో లాఠీచార్జ్, బాష్పవాయువు, నీటి ఫిరంగులను ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు, భద్రతా సిబ్బంది గాయపడినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. విద్యార్థులపై బలప్రయోగం చేయడం సరికాదని, వారి సమస్యలను ప్రభుత్వం చర్చల ద్వారా తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. అయితే రాహుల్ గాంధీ స్పందనపై రాజకీయ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల ఆందోళనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి నియామక పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి



## ప్రతి ఇంటా త్రివర్ణం.. ప్రతి హృదయంలో దేశభక్తి: ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 12: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశ ప్రజలు ఘనంగా, గర్వంగా జరుపుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పిస్తూ, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని కోరారు. ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం, ప్రతి హృదయంలో త్రివర్ణ పతాకం అనే స్ఫూర్తితో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని సూచించారు. దేశభక్తి భావనను మరింత బలోపేతం చేసేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం కేవలం చేతిలో పట్టుకునే జెండా మాత్రమే కాదని, ప్రతి భారతీయుడి గుండెల్లో నిలిచే జాతీయ గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలంతా త్రివర్ణ పతాకంతో తమ గర్వకారణమైన క్షణాలను పంచుకోవాలని, దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి ప్రతీకగా నిలిచే త్రివర్ణ పతాకాన్ని ప్రతి ఇంటా ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.



## డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 12: తెలంగాణలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమ్మిట్ సన్నద్ధతపై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యాపార రంగంలోని వివిధ విభాగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని సూచించారు. తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణకు దోహదపడేలా సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సలహాదారులు రామకృష్ణారావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జీనోమ్ వ్యాలీలో యామ్జెన్ అతి పెద్ద పరిశోధన కేంద్రం

హైదరాబాద్, ఆగస్టు 12: సందేశం టైమ్స్ ప్రతినిధి: గ్లోబల్ బయోటెక్నాలజీ దిగ్గజ సంస్థ యామ్జెన్ జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో తెలంగాణ ప్రభుత్వంతో యామ్జెన్ సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాలను మరింత విస్తరించే అంశంపై చర్చించారు. సమావేశం అనంతరం యామ్జెన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. జీనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేయనున్న ఈ అత్యాధునిక పరిశోధన కేంద్రం ద్వారా స్థానిక ప్రతిభావంతులైన యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. యామ్జెన్ ఇటీవల సుమారు 3 వేల మంది ఉద్యోగులతో అతిపెద్ద గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఔషధ, బయోటెక్నాలజీ రంగంలోని దిగ్గజ సంస్థలు తెలంగాణపై అపారమైన విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవమని మంత్రి అన్నారు. లైఫ్ సైన్సెస్ రంగానికి తెలంగాణ ఒక ముఖ్యమైన వేదికగా మారుతున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటయ్యే పరిశోధన కేంద్రంలో ఉద్యోగ నియామకాల సమయంలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని యామ్జెన్ యాజమాన్యానికి మంత్రి సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన లైఫ్ సైన్సెస్ పర్యావరణ వ్యవస్థ తెలంగాణను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా మార్చాయని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, వాపు సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోందని తెలిపారు. జీనోమ్ వ్యాలీలో యామ్జెన్ ఏర్పాటు చేయనున్న పరిశోధన, ఆవిష్కరణల కేంద్రం తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగానికి మరింత ఊతమివ్వడంతో పాటు పరిశోధన, ఉపాధి, నూతన ఆవిష్కరణలకు హైదరాబాద్‌ను మరింత కీలక కేంద్రంగా నిలబెట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ అవగాహన ఒప్పంద కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఈడీ శ్రీను కొనరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.



# 2026లో ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాల్సిందే: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 12 : సందేశం టైమ్స్ ప్రతినిధి: ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి 2026లోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిందేనని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను స్పష్టం చేశారు. మంగళవారం డా. బి.ఆర్. అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల పురోగతిపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బి చీఫ్ ఇంజనీర్ ధర్మారెడ్డితో పాటు పలువురు అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా పనులు పూర్తి కావాల్సిందేనని, పనుల్లో నిర్లక్ష్యాన్ని, ఆలస్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. ఉప్పల్-నారపల్లి మార్గంలో ఏళ్ల తరబడి ప్రయాణికులు తీవ్ర ట్రాఫిక్ సమస్యలు, రహదారి ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారని, అందుకే 2026 దసరా నాటికి కారిడార్‌ను పూర్తి చేస్తామని ప్రజలకు మాట ఇచ్చామని, ఇచ్చిన మాట ప్రకారం పనులు పూర్తి చేసి తీరాల్సిందేనని పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు పూర్తి జవాబుదారితనంతో పనిచేస్తోందని, ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు అధికారులు మనసుపెట్టి పనిచేయాలని మంత్రి కోరారు. పనుల్లో మరింత వేగం పెంచేందుకు మ్యాన్‌పవర్‌ను పెంచి మూడు షిఫ్టుల్లో పనులు నిర్వహించాలని, ముఖ్యంగా రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు నిరంతరాయంగా పనులు కొనసాగించాలని ఆదేశించారు. కారిడార్ కింద చేపడుతున్న 6.25 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి తేల్చిచెప్పారు. అటు నారపల్లి (సీపీఆర్ఐ) వైపు నుంచి, ఇటు ఉప్పల్ వైపు నుంచి ఇరువైపులా లాంచింగ్ గడ్డర్లను వినియోగిస్తూ పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. ప్రతి పది రోజులకు ఒకసారి తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షిస్తానని, ప్రతి రోజూ జరిగిన పనుల వివరాలతో వర్క్ ప్రోగ్రెస్‌ను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులపై మంత్రి అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. సైట్‌లో వాస్తవ పరిస్థితులను ఎలాంటి దాపరికం లేకుండా తెలియజేయాలని సూచించారు. ప్రస్తుతం ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు సుమారు 60 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 40 శాతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. సైట్‌లో సెగ్మెంట్ల తయారీ కోసం నాలుగు బెడ్లు, నాలుగు గ్యాంట్రీలతో సుమారు 300 మంది కార్మికులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారని తెలిపారు. అయితే పనులను మరింత వేగవంతం చేసేందుకు అటు నారపల్లి (సీపీఆర్ఐ) వైపు నుంచి, ఇటు ఉప్పల్ వైపు నుంచి ఇరువైపులా లాంచింగ్ గడ్డర్లతో పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. ఉప్పల్ వైపు నుంచి జరుగుతున్న పనుల పురోగతిపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీయగా, ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయిందని, రెండో స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనులు నిర్వహించడం, వర్షాల కారణంగా నిర్మాణ పనులకు కొంత సమయం అదనంగా పట్టే అవకాశం ఉందని నిర్మాణ సంస్థ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రజలు ఏళ్లుగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పనులను మరింత వేగంగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 31 నాటికి కారిడార్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఇప్పటికే డెడ్‌లైన్ నిర్ణయించుకున్నామని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆ గడువుకు అనుగుణంగా పనిచేయాలని మంత్రి అన్నారు. నిర్మాణ సంస్థ నుంచి పనుల గడువు పెంచేలా చేసిన విజ్ఞప్తిపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేసి, పనుల్లో వేగం పెంచాలని, మ్యాన్‌పవర్‌ను మరింత పెంచి మూడు షిఫ్టుల్లో పనులు నిర్వహించాలని స్పష్టం చేశారు. నెలకు ఆరు స్లాబుల చొప్పున పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఇదే సమయంలో కారిడార్‌కు అనుసంధానంగా జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులపై కూడా మంత్రి ఆరా తీశారు. జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలివేటెడ్ కారిడార్, అనుసంధాన ఫ్లైఓవర్ పనులు సమాంతరంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు గతంలో వివిధ కారణాలతో ఆలస్యమైన నేపథ్యంలో, ప్రస్తుతం పనులకు వేగం తీసుకురావడం, ప్రజలకు త్వరితగతిన సౌకర్యం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. 2026 సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిందేనని, ఇందుకోసం ఆర్అండ్‌బీ అధికారులు, నిర్మాణ సంస్థ పూర్తి సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు.

# పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి.. వీలైనంత త్వరగా టెండర్లు పూర్తి చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 12: సందేశం టైమ్స్ ప్రతినిధి: హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని, వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌పై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో పనుల పురోగతిపై అధికారులతో చర్చించి పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల పొడవునా చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రో రైలుకు రోజురోజుకూ ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైళ్లకు అదనపు బోగీలను జత చేయాలని, ఇందుకు అవసరమైన కొత్త మెట్రో రైలు కోచ్‌లను కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మెట్రో రెండో దశలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ప్రతిపాదించిన 7.5 కిలోమీటర్ల కారిడార్ నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంపై ఢిల్లీ మెట్రో అధికారులను సంప్రదించి అవసరమైన సలహాలు, సూచనలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మిట్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను ముందుగానే చేపట్టాలని ఆదేశించారు. వ్యాపార రంగంలోని వివిధ విభాగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్ సందర్భంగా సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు ఏర్పాట్లు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. గత ఏడాది నిర్వహించిన సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పెట్టుబడుల విషయంలో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణకు చెందిన 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోండి: ప్రధాని మోదీకి బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 12 : సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రానికి చెందిన 40 కులాలను కేంద్ర ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) జాబితాలో చేర్చేందుకు అవసరమైన చర్యలను త్వరితగతిన చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మరోసారి కోరారు. ఈ మేరకు ప్రధానమంత్రికి పంపిన లేఖలో తెలంగాణకు చెందిన 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చే అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, ముఖ్యంగా కులాల జనగణన-2027 ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ అంశాన్ని త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గతంలోనే 2026 ఏప్రిల్ 13న ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గతంలో సమర్పించిన వినతికి స్పందించిన కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ తెలంగాణకు చెందిన 40 కులాల వివరాలను కోరిందని, అందుకు అనుగుణంగా తెలంగాణ బీసీ కమిషన్ 2026 జూలై 18న ఆయా 40 కులాల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపించినట్లు వెల్లడించారు. అనంతరం 2026 ఆగస్టు 3న కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ పంపిన లేఖలో కేంద్ర ఓబీసీ జాబితాలో కులాలను చేర్చడం లేదా తొలగించడం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342ఏ నిబంధనల ప్రకారం జరుగుతుందని పేర్కొన్నట్లు తెలిపారు. ఈ అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యగా జి. నిరంజన్ పేర్కొన్నారు. సంబంధిత కులాల్లో కొన్ని కులాలు 2008లోనే తెలంగాణ రాష్ట్ర బీసీ జాబితాలో చేర్చబడ్డాయని, అయితే అప్పటి నుంచి మిగతా కులాలు కేంద్ర ఓబీసీ జాబితాలో స్థానం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ఈ అంశానికి సంబంధించి జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సీబీసీ) న్యూఢిల్లీలో రెండు దఫాలుగా విచారణలు నిర్వహించిందని వివరించారు. మొదటి దశ విచారణలు 2021 డిసెంబర్ 22 నుంచి 24 వరకు, రెండో దశ విచారణ 2023 సెప్టెంబర్ 5న జరిగినప్పటికీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 342ఏ ప్రకారం ఈ అంశానికి ఇప్పటికీ తుది పరిష్కారం లభించలేదని తెలిపారు. ఈ ఆలస్యం కారణంగా సంబంధిత 40 కులాలకు చెందిన ప్రజలు కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో లభించే ఓబీసీ అవకాశాలను కోల్పోతున్నారని జి. నిరంజన్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తగిన జోక్యం చేసుకోవాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ విజ్ఞప్తి చేశారు. సంబంధిత వర్గాలకు సామాజిక న్యాయం, వారికి లభించాల్సిన విద్య, ఉద్యోగ అవకాశాలు అందేలా ఈ అంశాన్ని అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. – పి.ఎ. టూ చైర్మన్.

# ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం సమర్పించిన మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, ఆగస్టు 12: సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ మంగళవారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని మారు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్ మనోహర్‌రెడ్డి, ఆలయ అర్చకులు మంత్రికి డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కొండా సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో జరిగిన మారు బోనం సమర్పణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బోనమెత్తిన మహిళలకు మంత్రి కొండా సురేఖ చీర, సారె అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మారు బోనం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో మారు బోనం తయారు చేసి సమర్పించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో ఎంతో విశిష్టమైన ఆచారమని పేర్కొన్నారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని మంత్రి అన్నారు. ఈ ఏడాది ఆషాఢ బోనాల ఉత్సవాలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లకు తోడు ప్రజల సహకారం అందడంతో ఈ ఏడాది బోనాల ఉత్సవాలు మరింత వైభవోపేతంగా జరుగుతున్నాయని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.



## హెచ్ఐవీ నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట, ఆగస్టు 12: సందేశం టైమ్స్ ప్రతినిధి: జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు నిర్వహించనున్న సమగ్ర సమాచార, విద్యా, ప్రచార కార్యక్రమానికి పటిష్టమైన ప్రణాళిక రూపొందించి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇందులో భాగంగా లక్ష్యిత జోక్య కార్యక్రమాలు, మొబైల్ సమగ్ర కౌన్సెలింగ్ మరియు పరీక్షా కేంద్రాలు, సమాజ ఆధారిత హెచ్ఐవీ స్క్రీనింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి అవసరమైన వారికి సకాలంలో పరీక్షలు, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన ప్రతి వ్యక్తిని యాంటీ రెట్రోవైరల్ చికిత్సకు అనుసంధానం చేయడంతో పాటు, వారు క్రమం తప్పకుండా చికిత్స కొనసాగించేలా ఫాలోఅప్ చేయాలని తెలిపారు. చికిత్సకు దూరమైన వారిని గుర్తించి తిరిగి చికిత్సలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వైరల్ లోడ్ పరీక్షలు, శిశువుల్లో ముందస్తు హెచ్ఐవీ నిర్ధారణ సేవలను సమర్థవంతంగా అందిస్తూ హెచ్ఐవీ నియంత్రణలోని 95-95-95 లక్ష్యాన్ని సాధించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. గర్భిణీ మహిళలకు హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలు తప్పనిసరిగా అందేలా చూడడంతో పాటు తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమణను నివారించే సేవలను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్ఐవీ పరీక్షా కిట్లు, యాంటీ రెట్రోవైరల్ మందులు, ప్రయోగశాల సేవలు, ఇతర అవసరమైన సామగ్రి అందుబాటులో ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సంబంధిత సమాచార వ్యవస్థలో డేటా నాణ్యతను మెరుగుపరచడం, రోజువారీ నివేదికలను సకాలంలో నమోదు చేయడం, పెండింగ్‌లో ఉన్న డేటా నమోదును పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడం, స్క్రీనింగ్ కార్యక్రమాలను విస్తరించడం, బాధితులకు సామాజిక సహాయం అందించేందుకు వైద్య ఆరోగ్య, మహిళా మరియు శిశు అభివృద్ధి, విద్య, పంచాయతీరాజ్, కార్మిక, సాంఘిక సంక్షేమ, డీఆర్‌డీఏ/సెర్ప్, యువజన సేవలు తదితర శాఖలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హెచ్ఐవీ నివారణ, ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్స, సామాజిక సహకారం ద్వారా జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాలను సాధించేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీ సీఈవో శిరీష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకట రమణ, డీపీఓ యాదగిరి, ఎయిడ్స్, లెప్రసీ కార్యక్రమ అధికారి డాక్టర్ ప్రసిద్ధ్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మాధవ్‌కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కోటిరత్నం, డాక్టర్ నాజియా, డాక్టర్ శ్రీశైలం, ఎయిడ్స్ సొసైటీ సీఈఓ సుధాకర్, ఉమ్మడి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సంపతయ్య, ఉమ్మడి జిల్లా సూపర్‌వైజర్, ఏఆర్‌టీ వైద్యాధికారి డాక్టర్ శ్రావణి, డిప్యూటీ డీఎంవో వి. సంజీవ్‌రెడ్డి, డీపీఓ ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు, అన్ని ఐసీటీసీ, పీపీసీటీసీ, డీసీఆర్‌సీ, ఏఆర్‌టీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. – జిల్లా పౌర సంబంధాల అధికారి, సూర్యాపేట


మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్

డిమాండ్స్



## మిషన్ భగీరథ కార్మికుల మూడు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం | జోగిపేట, ఆగస్టు 12: మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సంబంధిత కార్మికులు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల కొనుగోలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇతర కుటుంబ అవసరాలను తీర్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రతినెలా వేతనంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు జీతాలు సకాలంలో అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు నిరంతరం తాగునీటి సరఫరా అందించేందుకు విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమ వేతనాలు మాత్రం పెండింగ్‌లో ఉండటం బాధాకరమని అన్నారు. సంబంధిత అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లామని, సానుకూలంగా స్పందించి వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.



## గిన్నిస్ వరల్డ్ రికార్డులో మెదక్ గురు-శిష్యులు.. గ్రాండ్ మాస్టర్ పోచయ్య, మాస్టర్ మహేష్ గౌడ్‌కు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఘన సన్మానం

మెదక్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 12: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించిన కరాటే ప్రదర్శనలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించిన మెదక్ జిల్లా హత్నూర మండలం సిరిపురం గ్రామానికి చెందిన గ్రాండ్ మాస్టర్ పోచయ్య, మాస్టర్ మహేష్ గౌడ్ గురు-శిష్యులను ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఘనంగా సన్మానించారు. లండన్‌కు చెందిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కటా ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 2,000 మంది మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు ఒకేసారి ప్రదర్శన నిర్వహించగా, అందులో గ్రాండ్ మాస్టర్ పోచయ్య, మాస్టర్ మహేష్ గౌడ్ పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించడం మెదక్ జిల్లాకు, హత్నూర మండలానికి, సిరిపురం గ్రామానికి గర్వకారణమని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. కరాటే రంగంలో గురు-శిష్యులు సాధించిన ఈ ఘనత యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ వారిని అభినందించారు. క్రీడా రంగంలో మరింతగా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ పోచయ్య, మాస్టర్ మహేష్ గౌడ్‌లను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



## ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 12: సందేశం టైమ్స్ ప్రతినిధి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు, నిర్వహణ ప్రణాళికపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026కు సంబంధించిన ఏర్పాట్లు, క్రీడా పోటీల నిర్వహణ, మౌలిక వసతులు, క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తిచేసి ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. రాష్ట్రంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విజయవంతంగా నిర్వహించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో చర్చించారు. సమావేశానికి మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనా రెడ్డి, క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాల దేవి తదితరులు హాజరయ్యారు.

## తెలంగాణకు చెందిన 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలి: ప్రధాని మోదీకి బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 12: సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రానికి చెందిన 40 కులాలను కేంద్ర ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) జాబితాలో చేర్చేందుకు అవసరమైన చర్యలను త్వరితగతిన చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మరోసారి కోరారు. ఈ మేరకు ప్రధానమంత్రికి పంపిన లేఖలో తెలంగాణకు చెందిన 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చే అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, ముఖ్యంగా కులాల వారీ జనగణన 2027 ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ అంశాన్ని త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గతంలో 2026 ఏప్రిల్ 13న ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గతంలో సమర్పించిన వినతికి స్పందించిన కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ తెలంగాణకు చెందిన 40 కులాల వివరాలను కోరిందని, అందుకు అనుగుణంగా తెలంగాణ బీసీ కమిషన్ 2026 జూలై 18న ఆయా 40 కులాల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. అనంతరం 2026 ఆగస్టు 3న కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ పంపిన లేఖలో కేంద్ర ఓబీసీ జాబితాలో కులాలను చేర్చడం లేదా తొలగించడం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342ఏ నిబంధనల ప్రకారం జరుగుతుందని పేర్కొన్నట్లు నిరంజన్ తెలిపారు. ఈ అంశం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యగా పేర్కొన్న ఆయన, సంబంధిత కులాల్లో కొన్ని 2008లోనే తెలంగాణ రాష్ట్ర బీసీ జాబితాలో చేర్చబడ్డాయని, అయితే అప్పటి నుంచి మిగతా కులాలు కేంద్ర ఓబీసీ జాబితాలో స్థానం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ఈ అంశానికి సంబంధించి జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ న్యూఢిల్లీలో రెండు దఫాలుగా విచారణలు నిర్వహించిందని, మొదటి విచారణలు 2021 డిసెంబర్ 22 నుంచి 24 వరకు, రెండో విచారణ 2023 సెప్టెంబర్ 5న జరిగాయని వివరించారు. అయినప్పటికీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 342ఏ ప్రకారం ఈ అంశానికి ఇంకా తుది పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ఈ జాప్యం కారణంగా సంబంధిత 40 కులాలకు చెందిన ప్రజలు కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో లభించే ఓబీసీ అవకాశాలను కోల్పోతున్నారని జి. నిరంజన్ తెలిపారు. కాబట్టి తెలంగాణకు చెందిన 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తగిన జోక్యం చేసుకోవాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ విజ్ఞప్తి చేశారు. సంబంధిత వర్గాలకు సామాజిక న్యాయం, వారికి లభించాల్సిన విద్యా, ఉద్యోగ అవకాశాలు అందేలా ఈ అంశాన్ని అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. – పి.ఎ. టు చైర్మన్

## వికలాంగుల హామీలు వెంటనే అమలు చేయాలి.. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం: గిద్దె రాజేష్



సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి, ఆగస్టు 12: వికలాంగులకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ ఆధ్వర్యంలో వికలాంగుల ఉద్యమం మరోసారి ఉధృతమైంది. మంగళవారం వికారాబాద్ జిల్లాలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోని తాండూర్-వికారాబాద్ ప్రధాన రహదారిపై సంఘం నాయకులు, కార్యకర్తలతో కలిసి గిద్దె రాజేష్ బైఠాయించి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వికలాంగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వారి సమస్యలను విస్మరించడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్లను రూ.6,000కు పెంచుతామని, వికలాంగులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, తెలంగాణలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని, రాష్ట్రంలో వికలాంగులపై జరిగే దాడులను అరికట్టేందుకు అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని, ప్రభుత్వ శాఖల్లో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చిందని గిద్దె రాజేష్ గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఇచ్చిన మాటలుగా మిగిలిపోకూడదని, వికలాంగులు కూడా రాష్ట్రానికి సమాన హక్కులు కలిగిన పౌరులేనని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అదే సమయంలో వికలాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం రూ.10 లక్షలతో 'వికలాంగుల బంధు' పథకాన్ని ప్రవేశపెట్టి, ఆసరా పింఛన్ పొందుతున్న ప్రతి వికలాంగుడికి ఈ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వికలాంగులకు ఉన్న 5 శాతం రిజర్వేషన్‌ను 100 శాతానికి పెంచి, ఆసరా పింఛన్ పొందుతున్న అర్హులైన ప్రతి వికలాంగుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో వెంటనే కొత్త పింఛన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు రాకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని గిద్దె రాజేష్ హెచ్చరించారు. అవసరమైతే ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్త దండయాత్ర చేపట్టి కొడంగల్‌లో లక్ష మందితో 'వికలాంగుల ఆవేదన సభ' నిర్వహిస్తామని ప్రకటించారు. వికలాంగుల హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నరసింహులు, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పసుల చంద్రయ్య, రాష్ట్ర నాయకులు, వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ పోతురాజు సుధీర్, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యవర్గ సభ్యులు కడియ నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం. చుక్కయ్య, పరిగి డివిజన్ నాయకులు లక్ష్మయ్య, నూతన నాయకులు బొంపల్లి ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, నారాయణ, జంగయ్య, యాదయ్య, జే. రాములు, మహిళా నాయకురాళ్లు లక్ష్మి, భాగ్యమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు ఉరడి హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పేరుతో మధిర పట్టణంలో విధ్వంసం: మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు

సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్చార్జి శెట్టి సురేష్: మధిర, ఆగస్టు 12: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మధిర పట్టణంలో అభివృద్ధి పేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు లింగాల కమల్ రాజు ఆరోపించారు. మధిర పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల తీరును నిరసిస్తూ మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో మధిర పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు, సుందరీకరణ చేపట్టామని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పేరుతో పట్టణంలో విధ్వంసం జరుగుతోందని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కమీషన్ల కోసమే అభివృద్ధి పేరుతో నిధులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో మధిర పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమైందని, ప్రజలకు ఉపయోగపడే చెప్పుకోదగిన అభివృద్ధి పని ఒక్కటి కూడా జరగలేదని విమర్శించారు. బైపాస్, ఔటర్ రింగ్ రోడ్డు వంటి పనుల పేరుతో మరోసారి పట్టణంలోని రహదారులను ధ్వంసం చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇప్పటికే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పేరుతో రోడ్లను ధ్వంసం చేశారని, ఆ పనులకు సంబంధించిన మరమ్మతులు పూర్తికాకముందే అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్ల పేరుతో మళ్లీ రోడ్లను తవ్వుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలో ముందస్తుగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా మార్కింగ్ చేసి కూల్చివేతలకు పాల్పడుతున్నారని అన్నారు. అభివృద్ధి పనుల పేరుతో కాంగ్రెస్ నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారని, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా పనులు చేపడితే బీఆర్ఎస్ పార్టీ తరఫున అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులను శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపట్టాలని, ఇప్పటికే ధ్వంసమైన రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని లింగాల కమల్ రాజు హెచ్చరించారు.



# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి.. భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిద్దాం: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 12: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరిశుభ్రత, పచ్చదనం, సమతుల్యమైన మరియు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కాపాడటంలో మొక్కలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భావితరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. నేటి మొక్కలే రేపటి మహావృక్షాలని పేర్కొన్న ఎస్పీ, వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ అవి ఆరోగ్యంగా ఎదిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వనమహోత్సవ కార్యక్రమాలను నిర్వహించి పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను నిరంతరం సంరక్షించాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఐలు మహేష్, జర్ణ్, రాజశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మధిరలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం.. రక్తపు మరకలతో కలకలం

సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్చార్జి శెట్టి సురేష్: మధిర, ఆగస్టు 12: మధిర–వైరా ప్రధాన రహదారిలోని పీవీఆర్ కళ్యాణ మండపం సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ముఖం, చేతులపై రక్తపు మరకలు కనిపించడంతో మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు ఖమ్మం నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించిన పోలీసులు సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించారు. రూరల్ సీఐ మధు, టౌన్ సీఐ రమేష్, ఎస్ఐ సవిత సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్‌తో కలిసి ఆధారాలను స్వీకరించారు. మృతుడి వివరాలు, మరణానికి గల కారణాలు, ఘటన జరిగిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదాలు.. ఒకే హైవేపై 9 మంది మృతి

సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 12: సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని మొత్తం 9 మంది మృతి చెందారు. మొదటి ఘటనలో కూలీలతో వెళ్తున్న ఆటోను ట్యాంకర్ ఢీకొనడంతో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాద సమయంలో ఆటోలో మొత్తం 14 మంది కూలీలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు అదే హైవేపై వరుసగా మూడు కార్లు ఢీకొన్న మరో ప్రమాదం చోటుచేసుకోగా ఇద్దరు మృతి చెందారు. ఈ రెండు ప్రమాదాల్లో మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదాల సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వరుస ప్రమాదాలతో హైవేపై తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ప్రమాదాలకు గల పూర్తి కారణాలు, మృతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.



# చేయూత పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ.. ఆగస్టు 31 చివరి గడువు: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 12: తెలంగాణలో చేయూత సామాజిక భద్రత పింఛన్ల కోసం కొత్త దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, అర్హులైన నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 31, 2026 చివరి తేదీ అని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అధికారిక చేయూత పోర్టల్ https://cheyutha.telangana.gov.in ద్వారా లేదా గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల నుంచి దరఖాస్తు ఫారాన్ని పొందవచ్చని వివరించారు. గ్రామీణ ప్రాంతాల వారు పూర్తి చేసిన దరఖాస్తులను గ్రామపంచాయతీ కార్యదర్శికి లేదా ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని, పట్టణ ప్రాంతాల వారు వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు లేదా మున్సిపల్ కమిషనర్లకు అందజేయాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తులు గ్రామపంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో లేదా మున్సిపల్ కార్యాలయంలో ఉన్నాయా, వాటికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జత చేశారా అనే విషయాలను సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. చేయూత పింఛన్లకు వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్, తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులు తదితరులు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు. వితంతువులకు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఒంటరి మహిళలకు వేర్పాటు ధ్రువీకరణ లేదా తహసీల్దార్ స్థానిక విచారణ నివేదిక, దివ్యాంగులకు యూడీఐడీ ధ్రువీకరణ పత్రం, కల్లుగీత కార్మికులకు నిషేధ, ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ పత్రం, చేనేత కార్మికులకు చేనేత, వస్త్ర పరిశ్రమ శాఖ ధ్రువీకరణ పత్రం, ఫైలేరియా బాధితులకు వైద్య, ఆరోగ్య శాఖ ధ్రువీకరణ పత్రం అవసరమని తెలిపారు. పింఛన్ల మంజూరుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సంబంధిత శాఖల ద్వారా సకాలంలో జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. స్వయం సహాయక బృందాల సమాఖ్యలు అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందడంలో సహకరించాలని సూచించారు. ఆన్‌లైన్ డేటా ఎంట్రీ కోసం ప్రత్యేక తెరలను అందుబాటులోకి తీసుకొచ్చామని, ప్రతి మండలానికి మూడు, ప్రతి పురపాలక సంఘానికి ఐదు, ప్రతి పురపాలక సంస్థకు పది డేటా ఎంట్రీ లాగిన్ ఐడీలు సృష్టించినట్లు తెలిపారు. డేటా నమోదు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అసంపూర్ణమైన లేదా తప్పు వివరాలను నమోదు చేయరాదని అధికారులను ఆదేశించారు. మూడు ఎకరాలకు మించి మాగాణి లేదా 7.5 ఎకరాలకు మించి మెట్ట భూమి ఉన్నవారు, నాలుగు చక్రాల వాహనాలు కలిగినవారు, ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఉద్యోగులు అనర్హులని స్పష్టం చేశారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం, యూడీఐడీ లేదా సదరం ధ్రువీకరణ పత్రాలను, వర్తించే విధంగా, జత చేయాలని కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకుని చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు.




## డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. భవిష్యత్తుకు బాటలు వేసుకోండి: యువతకు ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపు

మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 12: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌తో పాటు మెదక్ పట్టణానికి చెందిన పలువురు మీడియా ప్రతినిధులు మంగళవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎస్పీ అభినందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఓటీపీ, పిన్, సీవీవీ, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండి తమ భవిష్యత్తును బంగారు బాటలో తీర్చిదిద్దుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. జిల్లాలో డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగుతోందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలు, విద్యార్థినుల్లో చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు మరింత చేరువగా పోలీసింగ్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణలో ప్రజలతో పాటు మీడియా సహకారం ఎంతో కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. మహిళలు, బాలికల భద్రత కోసం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులు చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా తరఫున పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, కోశాధికారి చెవిటి అశోక్, గౌరవ కార్యవర్గ సభ్యులు కామాటి కృష్ణ, నీలం, శ్రీధర్, సందీప్, రమేష్, సిద్ధు, రాజాగౌడ్, రహమత్, ఫణిరాజ్, శ్రీహరిగౌడ్, కార్తీక్, సుబ్బు, మల్లేశం, ఫసి, మల్లికార్జున్, లక్ష్మణ్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## మామిడి తోటలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్చార్జి సురేష్: చింతకాని, ఆగస్టు 11: చింతకాని మండలం నాగులవంచ గ్రామ శివారులోని మామిడి తోటలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ జి. నరేష్ సిబ్బందితో కలిసి మామిడి తోట వద్దకు చేరుకోగా దుగ్యాల బసవయ్య, మేడ లాలయ్య, రాగ ఉపేందర్, పడిశాల నవీన్ 52 పేక ముక్కలతో పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. పోలీసులను గమనించిన పడిశాల నవీన్ అక్కడి నుంచి తప్పించుకుని పారిపోగా, మిగిలిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పంచుల సమక్షంలో నిర్వహించిన పంచనామాలో పేకాటకు వినియోగిస్తున్న రూ.90,110 నగదు, 52 పేక ముక్కలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక యాక్టివా స్కూటర్, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసు దాడిలో ఎస్ఐ జి. నరేష్, హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుళ్లు బషిరుద్దీన్, వెంకటేశ్వరరావు, డ్రైవర్ సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందిని వైరా సీఐ వై.వి. ప్రసాద్, వైరా ఏసీపీ ఎస్.ఎస్. పాణి అభినందించారు.



## హెచ్‌ఐవీ పరీక్షలకు డిజిటల్ విధానం.. క్యూఆర్ కోడ్‌తో సులభంగా సేవలు

మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 12: మెదక్ జిల్లాలో హెచ్‌ఐవీ పరీక్షలు, సంబంధిత ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత సులభంగా అందించేందుకు డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో క్యూఆర్ కోడ్ సేవలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ డిజిటల్ విధానం ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సమీపంలోని హెచ్‌ఐవీ పరీక్షా కేంద్రాలు, అందుబాటులో ఉన్న సేవలు తదితర వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. హెచ్‌ఐవీపై అనుమానం ఉన్న వారు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, తమ గోప్యతకు భంగం కలగకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్‌ఐవీని ముందుగానే గుర్తించడం ద్వారా అవసరమైన వైద్య సేవలు, చికిత్సను సకాలంలో పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు అపోహలకు గురికాకుండా హెచ్‌ఐవీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని, అవసరమైన వారు సమీపంలోని ఐసీటీసీ, హెచ్‌ఐవీ పరీక్షా కేంద్రాలను సంప్రదించాలని కలెక్టర్ కోరారు. 'హెచ్‌ఐవీపై అవగాహన.. సకాలంలో పరీక్ష.. ఆరోగ్యకరమైన సమాజం' అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ హరి ప్రసాద్, ఐసీటీసీ కౌన్సిలర్ ధనశ్రీ, గోపి సుధాకర్, రవి, పీఎంవో శంకర్ రాథోడ్, కాముని రాజేశ్వర్, స్కోప్ ఎన్‌జీవో ప్రతినిధులు ఉప్పలయ్య, అనిల్, లింక్ వర్కర్ ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మణ్, స్టాఫ్ నర్స్ సౌందర్య, అంజిరెడ్డి, సీపీఎం శ్రీనివాస్, అకౌంటెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్‌పామ్ తోటల్లో వీవిల్ విడుదల.. అధిక దిగుబడులకు దోహదం: ఉద్యాన శాఖ అధికారులు

మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 12: మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండలంలోని ప్రభు వరగౌడ్ ఆయిల్‌పామ్ తోటల్లో పరాగ సంపర్కం కోసం ఉద్యాన శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఎలిడోబియస్ కెమెరోనికస్ వీవిల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె. ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల్లో వీవిల్‌ను విడుదల చేయడం ద్వారా సమర్థవంతమైన పరాగ సంపర్కం జరిగి ఫలదీకరణ మెరుగుపడి గెలల ఏర్పాటు పెరిగి దిగుబడులు అధికంగా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆయిల్‌పామ్ రైతులు ప్రభుత్వం, ఉద్యాన శాఖ సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ వీవిల్‌ను సరైన పద్ధతిలో విడుదల చేసుకోవాలని సూచించారు. తోటల నిర్వహణ, వీవిల్ విడుదల, పరాగ సంపర్కం తదితర అంశాలపై రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తామని, రైతులు ఎప్పటికప్పుడు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులు మెరుగైన ఆదాయం పొందేలా అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు ఉద్యాన శాఖ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె. ప్రతాప్ సింగ్, హవేలీఘనపూర్ వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి, ఉద్యాన అధికారి రచన, లీవ్ పామ్ కంపెనీ మేనేజర్ కృష్ణ, కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారిణి తేజస్విని, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీ తీర్మానం తర్వాతే పనులు చేపడతా: సర్పంచ్ గోపాల్

సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం: పోసానిపేట, డిసెంబర్ 12: పోసానిపేట గ్రామంలోని పల్లె ప్రగతి వనంలో గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా చెట్లను నరికిన అంశంపై మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) రవీందర్ రెడ్డి చొరవతో గ్రామంలో సమావేశం నిర్వహించారు. గ్రామ సెక్రటరీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకుల సమక్షంలో ఈ అంశంపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ ఇకపై గ్రామంలో చేపట్టే పనుల విషయంలో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకుంటానని, గ్రామపంచాయతీ తీర్మానం చేసిన తర్వాతే పనులు చేపడతానని తెలిపినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. పల్లె ప్రగతి వనంలో నరికిన చెట్ల ద్వారా వచ్చిన డబ్బులను గ్రామపంచాయతీకి అందజేయాలని ఎంపీఓ రవీందర్ రెడ్డి సూచించారు. అలాగే నరికిన చెట్ల స్థానంలో కొత్త మొక్కలను నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకు సర్పంచ్ గోపాల్ అంగీకరించి, నరికిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రతి పనిని గ్రామపంచాయతీ తీర్మానం, సభ్యుల సమన్వయంతో చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో గ్రామ సెక్రటరీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 12: టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌ను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ పరిధిలో రాత్రి గస్తీ, వాహన తనిఖీలు, నాకాబందీలను పటిష్ఠంగా నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లు కలిగినవారు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వారిపై ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా గ్రామాలు, విద్యాసంస్థల పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని, సైబర్ నేరాల అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేసే విధానాన్ని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించిన ఎస్పీ, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ప్రతి ఫిర్యాదును సక్రమంగా నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడిన ఆయన విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందిస్తూ పోలీస్‌శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. ఎస్పీ వెంట సీఐలు రేణుకరెడ్డి, సందీప్‌రెడ్డి, ఎస్ఐ అరవింద్ ఉన్నారు.



# మెదక్ జిల్లాలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తి: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 12: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మెదక్ జిల్లాలో ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమం జూన్ 25న ప్రారంభమైందని, తొలి దశలో జూన్ 25 నుంచి 30వ తేదీ వరకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం జూలై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించడంతో పాటు ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టారని పేర్కొన్నారు. మెదక్ నియోజకవర్గంలో మొత్తం 2,20,427 మంది ఓటర్లు ఉండగా, 2,01,705 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేశామని, ఇది మొత్తం ఓటర్లలో 91.51 శాతమని తెలిపారు. మిగిలిన 18,722 మంది ఓటర్లను వివిధ కారణాలతో అన్‌కలెక్టబుల్‌గా గుర్తించామని, వీరిలో 5,431 మంది మరణించిన వారు, 3,433 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 8,948 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, 874 మంది ఆచూకీ లభించని వారు, 36 మంది ఇతర కారణాల కింద ఉన్నారని వివరించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మొత్తం 2,32,713 మంది ఓటర్లు ఉండగా, 2,08,499 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేశామని, ఇది మొత్తం ఓటర్లలో 89.59 శాతమని తెలిపారు. మిగిలిన 24,214 మంది ఓటర్లను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించామని, వీరిలో 7,735 మంది మరణించిన వారు, 3,414 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 12,153 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, 634 మంది ఆచూకీ లభించని వారు, 278 మంది ఇతర కారణాల కింద ఉన్నారని వెల్లడించారు. డిజిటలైజేషన్ పూర్తయిన ఓటర్ల శాతం, వివిధ కారణాలతో అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన ఓటర్ల శాతం కలిపి మెదక్ జిల్లాలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను కలెక్టర్ అభినందించారు.

# అర్హులైన వారికి చేయూత పింఛన్లు పారదర్శకంగా అందాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్





మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 12: ప్రభుత్వం నూతనంగా అందించనున్న ఏడు రకాల చేయూత సామాజిక భద్రత పింఛన్లకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను పారదర్శకంగా స్వీకరించి, సకాలంలో పరిష్కరించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరం నుంచి జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన గూగుల్ మీట్‌లో చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ, డేటా ఎంట్రీ, పరిశీలన తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 15 నుంచి నూతనంగా అందించనున్న చేయూత పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించాలని సూచించారు. ప్రజాప్రతినిధుల ద్వారా, ప్రజావాణి కార్యక్రమాల్లో పింఛన్ల కోసం అందిన దరఖాస్తులను తక్షణమే డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు అవసరమైన సమాచారం, సహాయం అందించేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఎంపీడీవో కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం వద్ద చేయూత పింఛన్లపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధాప్య, బీడీ కార్మికుల పింఛన్లను మినహాయించి మిగిలిన పింఛన్ల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, వృద్ధాప్య, బీడీ కార్మికుల పింఛన్ల దరఖాస్తులను ప్రభుత్వం అనుమతించిన అనంతరం పరిష్కరించాలని స్పష్టం చేశారు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల సమన్వయంతో దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను పటిష్ఠంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ నుంచి డేటా ఎంట్రీ, అర్హుల గుర్తింపు వరకు ఎక్కడా అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఏపీవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గౌడ సంఘం సభ్యులను సన్మానించిన మాజీ ఎంపీటీసీ తమన్నగారి సంగన్న

వట్పల్లి మండలం సందేశం టైమ్స్ | ఆగస్టు 12, సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మర్వెల్లి గ్రామంలో రేణుక మాత బోనాల పండుగను విజయవంతంగా నిర్వహించిన గౌడ సంఘం అధ్యక్షుడు, సభ్యులను మాజీ ఎంపీటీసీ తమన్నగారి సంగన్న ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేసిన గౌడ సంఘం అధ్యక్షుడు, సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఐక్యతతో పండుగను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. రేణుక మాత ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివి.. కలలను నిజం చేసుకోండి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి | ఆగస్టు 11.విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు(ఎస్) కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, వంటగది, వసతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న భోజనం, మెనూ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. భోజనం నాణ్యతగా ఉందని, ఇదే నాణ్యతను నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. చదువుతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. తరగతి గదిలో విద్యార్థులతో సరదాగా మాట్లాడిన కలెక్టర్.. పెద్దయ్యాక ఏమవుతారని ప్రశ్నించగా పలువురు డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్ అవుతామని ఉత్సాహంగా సమాధానమిచ్చారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని అభినందించిన ఆయన.. సొంత కాళ్లపై నిలబడాలంటే చదువే ఏకైక మార్గమని, కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేస్తూ, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విశాల్, తహసిల్దార్ అమిన్ సింగ్, ప్రిన్సిపాల్ వై. సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు దుర్మరణం



సంగారెడ్డి సందేశం టైమ్స్ జిల్లా ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్ | ఆగస్టు 12,సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పరిధిలోని జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, నాలుగు కార్లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. సమాచారం ప్రకారం సంగారెడ్డి నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారును వెనుక నుంచి మరో వాహనం బలంగా ఢీకొట్టడంతో కారు అదుపుతప్పి ఎగిరి రహదారికి అవతలి వైపు పడిపోయింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఇతర వాహనాలు కూడా ఒకదానికొకటి ఢీకొనడంతో మొత్తం నాలుగు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## తేనేటీగల పెంపకంతో అదనపు ఆదాయం పొందాలి

సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్ | ఆగస్టు 11, మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చిల్లర్ గ్రామంలో రైతులకు తేనేటీగల పెంపకంపై జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన కల్పించారు. తేనేటీగల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు పంటల దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉందని అధికారులు వివరించారు. తేనె ఉత్పత్తితో పాటు పంటల్లో పరాగసంపర్కం పెరగడం ద్వారా దిగుబడులు 20 నుంచి 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. తేనేటీగల పెంపకానికి అవసరమైన పెట్టుబడి, నిర్వహణ పద్ధతులు, తేనె సేకరణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తేనేటీగల పెంపకాన్ని ఉపాధి మార్గంగా స్వీకరించి అదనపు ఆదాయం పొందాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## మేడికుంద ప్రాథమికోన్నత పాఠశాలలో అక్షయ పాత్ర భోజనం ప్రారంభం

వట్పల్లి మండలం సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 12,సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మేడికుంద ప్రాథమికోన్నత పాఠశాలలో అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. అక్షయ పాత్ర ఆత్మ కమిటీ ఛైర్మన్ కాచూర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో పాఠశాలలో వంట కార్మికుల ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేవారు. అయితే తల్లిదండ్రుల కోరిక మేరకు మండల విద్యాశాఖ అధికారులు సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రతిపాదన పంపించగా, దాని ఫలితంగా మంగళవారం నుంచి అక్షయ పాత్ర భోజన సేవలు ప్రారంభమైనట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించేందుకు అక్షయ పాత్ర కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి కృషి చేసిన సర్పంచ్, ఏఏపీ అధ్యక్షురాలు, ఉప సర్పంచ్, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలకు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



## ఈదులపల్లిలో ఘనంగా ఆషాఢ మాసం బోనాలు

ఝరాసంగం సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 12,సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం ఈదులపల్లి గ్రామంలో ఆషాఢ మాసం బోనాల పండుగను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని భారీ ఊరేగింపుగా తరలివచ్చారు. మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలతో గ్రామంలో సందడి చేశారు. శివసత్తుల ఆటపాటలు, కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ ప్రజలంతా ఐక్యంగా పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బోనాల ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి, పర్యవేక్షణలో కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రాజకీయ నాయకులు, మహిళలు, యువకులు, చిన్నారులు, గ్రామ ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఈ నెల 14న తెలంగాణ కేబినెట్ సమావేశం

హైదరాబాద్ సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 12,తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 14న జరగనుంది. ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనాపరమైన అంశాలతో పాటు పలు కీలక నిర్ణయాలపై మంత్రివర్గం చర్చించనున్నట్లు సమాచారం. రాష్ట్రానికి సంబంధించిన ముఖ్యమైన విధానపరమైన అంశాలపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.




## నారాయణఖేడ్ అభివృద్ధికి మరో కీలక ముందడుగు

సంగారెడ్డి సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 12,సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సచివాలయంలో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్‌రెడ్డి సమావేశంలో పాల్గొని నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి సమస్యలు, నీటిపారుదల వసతుల అభివృద్ధి, పెండింగ్ పనులపై సమగ్రంగా చర్చించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీరు, తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టులకు సంబంధించిన పనులను వేగవంతం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొని నియోజకవర్గంలోని సమస్యలు, ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, చేపట్టాల్సిన అభివృద్ధి చర్యలపై వివరాలు అందించారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు.

## ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 నిర్వహించాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 12, తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉన్నతాధికారులతో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏర్పాట్లు, నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీలకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. డిసెంబరులో పోటీలను నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని స్టేడియంల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, క్రీడా పోటీలకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులు, ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులను భాగస్వాములను చేసేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలని సూచించారు. మౌలిక వసతులు, క్రీడల నిర్వహణ, అతిథులకు అవసరమైన సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించి పని విభజన చేసుకుని అధికారులు బాధ్యతలు తీసుకోవాలని తెలిపారు. తెలంగాణకు చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు, ఒలింపిక్స్ అసోసియేషన్‌తో పాటు జాతీయ స్థాయి క్రీడా ప్రతినిధులను కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా 20 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో క్రీడా విభాగాల వారీగా పోటీ ప్రదేశాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. క్రీడా స్ఫూర్తిని చాటేలా పోటీల నిర్వహణ ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎస్ఏటీజీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్ఏటీజీ ఎండీ సోనీబాల దేవి పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.